ప్రజాశక్తి
ఆదివారం 25 మే, 2025
5
శ్రీకాకుళం

ఉపాధ్యాయుల పాట్లు

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు విద్యాశాఖ అనుమతులు మంజూరు చేశారు. దీంతో బదిలీ ఉపాధ్యాయులు పాట్లు పడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బదిలీ దరఖాస్తులు నమోదు చేసుకున్నా... ఆ దరఖాస్తులను వాటికి సంబంధించిన వివరాలతో కూడిన అప్లికేషన్‌ను సంబంధిత ప్రధానోపాధ్యాయునికి అందించి వారి అనుమతి తీసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణ చేసిన తర్వాత సంబంధిత అప్లికేషన్ ఆయా మండలాల్లోని మండలస్థాయి విద్యాశాఖాధికారులకు అందించి రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న వెబ్‌సైట్‌లో వాటిని నమోదు చేయాలి. ఈ ప్రకియలో భాగంగా ఒక్కో సారి సర్వర్ డౌన్ అవుతుండడంతో నమోదు ప్రక్రియ నిలిచిపోతుండడంతో ఉపాధ్యాయులు, మండలస్థాయి అధికారులు ఆందోళనకు చెందారు. బదిలీల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు శనివారం చివరి రోజు కావడంతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురయ్యారు.

సమన్వయంతో లక్ష్యాలు అధిగమించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని ప్రతి గ్రామాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రైమరీ సెక్టార్స్ (ప్రాథమిక రంగం)పై శనివారం సమీక్షించి వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయం, ఉద్యానవన, సెరికల్చర్, వంశధార, ఎపిఎంఐడిసి వంటి కీలక శాఖల అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వనరులను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తొలుత ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించారు. వ్యవసాయం, ఉద్యానం, పాడిపరిశ్రమ, మత్స్య, పౌల్ట్రీ, పట్టుపరిశ్రమ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకుల భాగస్వామ్యంతో గ్రామాల్లో సమగ్ర ఆర్థిక పరిపుష్టి సాధించడం ముఖ్యమని స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో ఎంపిక చేసిన గ్రామాలను పూర్తిగా పచ్చదనంతో నింపాలని, సాగులో 60 శాతం ఉద్యాన పంటలు ఉండేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. సాయిల్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ల బలోపేతం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఒలు) బలోపేతం, ఫారం పాండ్ల పరిధిలో ఉద్యాన మొక్కలతో కొత్త ఎకో సిస్టమ్ ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. డ్రోన్ల వినియోగం పెంచాలని ఆదేశించారు.

తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో సూక్ష్మ సాగు (మైక్రో ఇరిగేషన్) ద్వారా సాగుబడిని విస్తరించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. మార్క్‌ఫెడ్ సహకారంతో ఎరువులు, మందులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైవిధ్యమైన శాఖల సమన్వయంతో గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయం, ఆరోగ్యం, మార్కెటింగ్, పారిశ్రామిక పెట్టుబడుల పరంగా గ్రామాలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఒ లక్ష్మీప్రసన్న, వ్యవసాయశాఖ జిల్లా అధికారి త్రినాథస్వామి, ఉద్యానవనశాఖ ఎడి ప్రసాదరావు, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మావోయిస్టులపై మారణకాండ గర్హనీయం

- కేశవరావుతో సహా మృతదేహాలను అప్పగించాలి
- హత్యలను తీవ్రంగా ఖండించిన వామపక్షాల సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా ఆ పార్టీ నాయకులు, ఆదివాసీలను హత్య చేసిన మోడీ ప్రభుత్వ ఫాసిస్టు చర్యలను వామపక్ష పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన వామపక్ష పార్టీలు, ప్రజా, కార్మిక, పౌర హక్కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా మృతుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలని డిమాండ్ చేసింది. నారాయణపూర్ మారణకాండతో సహా అడవుల్లో సాగిస్తున్న మారణహోమంపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని మరో తీర్మానం చేసింది. ఆపరేషన్ కగారును ఉపసంహరించుకోవాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. శాంతి చర్చలకు సిద్ధమైన సిపిఐ (మావోయిస్టు) పార్టీతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని సమావేశం డిమాండ్ చేసింది. బూటకపు ఎదురు కాల్పుల పేరిట జరిగే మారణకాండపై నిరసన వ్యక్తం చేసే ప్రజాస్వామిక హక్కును కాలరాస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వ నిరంకుశ విధానాన్ని ఈ సమావేశం ఖండించింది. ఖనిజ సంపదలతో కూడిన అడవులను బడా కార్పొరేట్లకు అప్పగించే ఆపరేషన్ కగారుకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాతంత్ర ఉద్యమానికి సమావేశం సంఘీభావం ప్రకటిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. సమావేశంలో సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర అధికార ప్రతినిధులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఎం, జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, నాయకులు ఎం.రామారావు, గురవయ్య, ఎం.లక్ష్మి, పత్తిరి, కె.వి.జగన్నాథరావు, కోదండం, పోలా ఈశ్వరరావు, మద్దెల ధర్మారావు, నేతింటి నీలంరాజు. కూర్మారావు, మిస్క కృష్ణయ్య, పి.పద్మ, కృష్ణవేణి పాల్గొని ప్రసంగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

గృహ నిర్మాణాలు వేగవంతం

గృహ నిర్మాణ సంస్థ జిఎం వెంకటరమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, నరసన్నపేట

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎపి గృహ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ (అకౌంట్స్, ఆడిట్) పి.వెంకటరమణ ఆదేశించారు. శ్రీకాకుళం అర్బన్ పరిధిలోని పెద్దపాడు, రాగోలు, ఆమదాల వలస అర్బన్‌లోని గాజులకొల్లివలస, నరసన్నపేట లేఅవుట్లను శనివారం సందర్శించారు. సాయంత్రం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహనిర్మాణ సంస్థ అధికారులతో, సిబ్బందితో సమీక్షించారు. గృహ నిర్మాణాల పురోగతి, నాణ్యతను స్వయంగా పర్యవేక్షించి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించారు. ప్రతి లేఅవుట్‌లోనూ మౌలిక వసతుల స్థితి, నిర్మాణాల నాణ్యతను నిశితంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం, ఆయా మండలాల్లో లబ్ధిదారులతో సమావేశమై, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అదనపు ఆర్థిక సహాయం అంశంపై పూర్తి వివరాలను వివరించారు. లబ్ధిదారులకు తమ నిర్మాణాలపై ఏవైనా సమస్యలు ఎదురైతే, తక్షణమే అధికారులు స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతిపై సమగ్ర నివేదికలను పరిశీలించారు. ప్రతి లేఅవుట్‌కూ సంబంధించిన పనుల ప్రగతి నివేదికలను సమీక్షించి, ఇప్పటికీ ప్రారంభించని మంజూరైన ఇళ్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. నిర్మిస్తున్న ప్రదేశాల్లో పనుల వేగాన్ని పెంచాలన్నారు. పనుల్లో నాణ్యతపై రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణాల్లో ఎలాంటి రాజీపడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఇంజినీర్లకు సూచించారు. గాజులకొల్లివలసలో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగడంపై హౌసింగ్ ఎఇ మోహనరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు సకాలంలో బిల్లులు అందడం లేదని ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. బిల్లులు చెల్లింపు మెటీరియల్ సప్లయి తదితర సమస్యలను పరిష్కరిస్తే నిర్మాణాలను పూర్తి చేస్తామని లబ్ధిదారులు ఆయనకు తెలిపారు. బిల్లులు చెల్లింపులు సకాలంలో చెల్లిస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి బి.నగేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు పాల్గొన్నారు. ప్రత్యేకాధికారి పర్యటన సందర్భంగా ఆయా లేఅవుట్ల వద్ద సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొని స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

సమీక్షిస్తున్న గృహ నిర్మాణ సంస్థ జిఎం వెంకటరమణ

రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి

జర్మనీలో నిర్వహించిన మినీ మహానాడులో ఎమ్మెల్యే శిరీష

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్‌ఆర్‌ఐలు కృషి చేశారని, తమవంతుగా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. జర్మనీలో శనివారం నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అక్కడ ఉన్న మాజీ సిఎం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనమంతా ఇతర దేశాల్లో ఉన్నా ఆంధ్రా రాష్ట్రం బాగుండాలని, భవిష్యత్ తరాలు వారికి చేయూతనిచ్చే విధంగా ముందుకు సాగాలని కోరారు. మీరంతా సిఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పాలనకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జర్మనీతో పాటు చుట్టపక్కల దేశాల్లో నివసిస్తున్న తెలుగువారికి ఆపద సమయాల్లో అందుబాటులో ఉంటామని తీర్మాణం ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కాంట్రాక్టర్లు

బిల్లుల చెల్లింపుల్లో సమ న్యాయం పాటించాలి

ప్రజాశక్తి- కాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ రకాల కాంట్రాక్టు పనులు చేస్తున్న తమకు బిల్లుల చెల్లింపులో సమ న్యాయం పాటించాలని కార్పొరేషన్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అందరమూ పనులు చేసినా కొంత మందికే చెక్ పేమెంట్స్ చేస్తున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తమకు రావాల్సిన డిపాజిట్లు, ఇఎండి, ఎఫ్‌ఎస్‌డి రావడం లేదని, ఎన్నిసార్లు విన్నవించుకుంటున్నా స్పందన కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేయాలని ఒత్తిడి తెచ్చే అధికారులు అగ్రిమెంట్ నుంచి బిల్లు రాసేవరకు సరియైన సమాధానాలు చెప్పకుండా తిరిగి తమపైనే కోపం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఎంబుక్ త్వరితగతిన రాసి బిల్లు ప్రక్రియ సకాలంలో జరిగేటట్లు చూడాలని కోరారు. నామినేషన్,సి బిల్లు పనులు అందరికీ సర్దుబాటు చేయాలని కమిషనర్ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా తమకు న్యాయం జరగలేదన్నారు. తమకు డిపాజిట్లు ఇప్పించడంతో పాటు బిల్లు ప్రక్రియ, నామినేషన్ బిల్లులు, చెక్ పేమెంట్స్ అందరికీ జరిగేలా చూడాలని వారు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జి.వి.రామానాయుడు, సింహాచలం, హరికృష్ణ, గంగురాజు, కామేష్, విజయ్, గణేష్, మోహన్, సంతోష్, సూర్యనారయణ ఉన్నారు.

మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపరచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్‌లో మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరికొన్ని చోట్ల తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. ఆర్‌టిసి బస్సులు ప్రయాణికులకు బస్సుల సమయాలను తెలియచేసే సమాచార పట్టికలను పరిశీలించారు. ప్రయాణికులతో బస్‌స్టేషన్‌లో గల సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌టిసి అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్, ఒకటి, రెండవ డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, సూపర్‌వైజర్లు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పక్కాగా మహిళల రుణ ప్రణాళిక

డిపిఎం శ్రీధర్

ప్రజాశక్తి- మందస

మహిళా సంఘాల వార్షిక రుణ ప్రణాళికలో మైక్రో క్రెడిట్ ప్లాన్ పక్కాగా, పారదర్శకంగా ఉండాలని జిల్లా ఉన్నతి డిపిఎం జి.శ్రీధర్ తెలిపారు. స్థానిక అమ్మవారి ఆలయ పరిధిలో వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అధ్యక్షతన మహిళా సంఘాలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారు చేసినప్పుడు సభ్యుల బయోమెట్రిక్‌ను కూడా తీసుకోవాలని తెలిపారు. అన్ని సంఘాలకూ ప్రతినెలా సమావేశం నిర్వహించే ప్రదేశాన్ని జియో ఫెన్సింగ్ చేయించాలన్నారు. సభ్యుల హాజరుకు ముఖ నమోదును ఫేసువల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వార్షిక రుణ ప్రణాళికలో సభ్యులు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల్లో కనీసం 70 శాతం ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని అవగాహన కల్పించారు. యాక్టివిటీ చేస్తున్న మహిళలకు డాక్యుమెంటేషన్ చేయించి వ్యక్తిగతంగా ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో విఒఎలు నీరజ, శారద, నాగమణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు బాలకృష్ణ, తారక్, మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్

వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం గంట పాటు వాహన తనిఖీలు నిర్వహించారు. సిసి టివి పనితీరును కూడా పర్యవేక్షించారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ నిరంతరం వాహన తనిఖీలు చేయాలన్నారు.

సారా, గంజాయి, ఒడిశా మద్యంను అడ్డుకోవాలని ఆదేశించారు. గంజాం జిల్లా ఎస్‌పిని బరంపురంలో కలిసి చర్చించి త్వరలో సంయుక్తంగా దాడులు నిర్వహించేందుకు ప్రణాళిక చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐలు జి.వి.రమణ, పి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

టెక్కలి రూరల్ : నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. టెక్కలి ఎక్సైజ్ స్టేషన్‌లో నవోదయం 2.0పై సమీక్షించారు. ఇప్పటి వరకు నాటు సారా కేసుల్లో అరెస్టు కాని వారిని తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ముద్దాయిలను రెవెన్యూ కార్యాలయాల్లో బైండోవర్ చేయాలన్నారు. బైండోవర్ అతిక్రమించిన వారి నుంచి రూ.2 లక్షలు అపరాధ, రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. బెల్లం, నాటుసారా తయారీకి సరఫరా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు, ఎఇఎస్ గోపాలకృష్ణ, ఎక్సైజ్ సిఐ ఎస్.కె.మీరాసాహెబ్ పాల్గొన్నారు.

టిడిపిలో రాజుకుంటున్న అసమ్మతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపిలో క్రమేణా అసమ్మతి రాజుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. ఇటీవల శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన పార్లమెంటరీ స్థాయి మినీమహానాడు వేదికగా పలువురు నేతల నోట వచ్చిన అసంతృప్తి మాటలే ఇందుకు అద్దం పడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల నాటి నుంచి కొనసాగుతున్న ఈ పోరు గత కొద్దికాలం పాటు సద్దుమణిగినట్లుగా కనిపించినా ప్రస్తుతం అంతర్లీనంగా బుసులు కొడుతున్నాయి. ప్రధానంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల ఈ అసంతృప్తి పాళ్లు కొంచెం ఎక్కువగానే ఉంది. తామే పార్టీ, తామే సర్వస్వమన్నట్లు వ్యవహరిస్తున్న తీరు అసమ్మతిని మరింత రాజేస్తోంది. ఎన్నికల్లో సహకరించిన నేతలు, వారి కేడర్‌ను పార్టీ సమావేశాలకు, కార్యక్రమాలకు దూరంగా ఉంచడం ద్వారా గ్రూపుల పోరును ప్రోత్సాహిస్తున్నట్లుగా కనిపిస్తోంది. టిడిపి జిల్లా అధ్యక్షునిగా ఉన్న కలమట వెంకటరమణను ఆ నియోజకవర్గంలో జరిగే ఏ కార్యక్రమానికీ పిలవకపోవడాన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వైసిపి నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ... తమ నేతను చాలా అవమానపరుస్తున్నారంటూ మండిపడుతున్నారు. పార్టీలో ఎక్కడైనా గ్రూపుల పోరు, ఇతర సమస్యలు ఉంటే అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని కార్యకర్తలు భావిస్తారు. కానీ, అధ్యక్షునికే విలువ లేని వింత పరిస్థితిని కలమట ఎదుర్కుంటున్నారు. పార్టీయే అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన నేపథ్యంలో అధిష్టానం నిర్ణయాన్ని ధిక్కరించేలా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వ్యవహరిస్తున్నా... చర్యలు తీసుకునే దిక్కులేకుండా పోయిందని కలమట వర్గీయులు అధిష్టానం వైఖరిని తప్పుపడుతున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోనూ అవే పరిస్థితులు కనిపిస్తోన్నాయి. నేనే రాజు...నేనే మంత్రి అన్నట్లు నేతలు వ్యవహరించడంతో అంతర్లీనంగా అసమ్మతి పోరు కొనసాగుతోంది. మినీ మహానాడుకు మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీని ఆహ్వానించినా జిల్లాలో మరో సీనియర్ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణను గాని, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని గాని ఆహ్వానించకపోవడం గుండ వర్గీయులను కలచివేసింది. కడపలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్న రాష్ట్ర మహానాడుకు పాసులు, వసతి ఏర్పాటు చేస్తున్నామంటూ రాష్ట్ర పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని ఆహ్వానించినట్లు తెలిసింది. గతంలో అమరావతిలో వివిధ సందర్భాల్లో నిర్వహిస్తున్న రాష్ట్ర పార్టీ కార్యక్రమాలకు ఆ కుటుంబానికి ప్రత్యేక ఆహ్వానం పంపారు. జిల్లా పార్టీ మాత్రం వారిని దూరంగానే ఉంచుతోంది. ఎన్నికలు ముగిసి ఏడాది కావొస్తున్నా పార్టీ పెద్దలు ఇంకా కక్ష పూరితంగానే వ్యవహరిస్తున్నారంటూ నియోజకవర్గ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి.

మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ మహానాడు వేదికగా చేసిన ప్రసంగానికి శ్రేణుల నుంచి వచ్చిన స్పందన చూస్తే కార్యకర్తల్లో ఏ స్థాయిలో అసంతృప్తి ఉందో స్పష్టమవుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదయినా ఒక్కసారీ జిల్లాస్థాయి సమావేశం పెట్టకపోవడాన్ని ఆయన ప్రస్తావించారు. కార్యకర్తల బాధలను వినే పరిస్థితి లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కొంత చర్చకు దారి తీశాయి. జిల్లాలో ఒకట్రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన చోట్ల కార్యకర్తలు కొంత ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో కష్టపడిన వారిని పక్కన పెట్టి తనకు భజన చేసే వారిని కొంత మంది ఎమ్మెల్యేలు ప్రోత్సాహిస్తున్నారన్న ఆవేదన శ్రేణుల్లో గూడుకట్టుకుని ఉంది. తాము సొంతంగా ఏ పని చేయించుకోలేని స్థితిలో ఉన్నామనే బాధ ద్వితీయ శ్రేణిన నాయకుల్లో నెలకొంది. నామిటేటెట్ పదవులు దక్కలేదన్న అసంతృప్తి కూడా వారిని వేధిస్తోంది. టిడిపి సింగిల్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంలో అన్నీ పదవులూ టిడిపి వారికే దక్కేవి. ఇప్పుడు కూటమిగా ఏర్పడటంతో కొన్ని పదవులు మిత్రపక్షాలకు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. టిడిపి కోటాగా వచ్చిన పదవుల్లోనూ తమకు ప్రాధాన్యత దక్కకపోవడంపై వారు కినుక వహిస్తున్నారు. ఎమ్మెల్యేలతో పోలిస్తే పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉన్నా తమను కాదని వేరే వారికి పదవులు కట్టబెట్టడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు.

వైసిపి ప్రభుత్వ వేధింపులకు గురైన వారిలో అర్థబలం, అంగబలం ఉన్నవారు తట్టుకున్నారని, మిగిలిన వారిని మనం ఆదుకోవాలని మాజీ మంత్రి శివాజీ నొక్కి వక్కానించడం, కార్యకర్తలు ఆలోచనలు ఒకలా ఉన్నాయి, రాష్ట్ర పార్టీ ఆలోచనలు మరోలా ఉన్నాయంటూ ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రస్తావించడం ద్వారా జిల్లాలో రెడ్‌బుక్ తెరవాలని పార్టీ శ్రేణులు బలంగా కోరుకుంటున్నట్లుగా కనిపిస్తోంది అయితే లోకేష్ రెడ్‌బుక్‌లో కేవలం చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, వారి కుటుంబ సభ్యులను దూషించిన, అనుచిత వ్యాఖ్యలు చేసిన వారు మాత్రమే ఉండటం, జిల్లాకు సంబంధిన వారెవరూ ఆ జాబితాలో లేకపోవడం కార్యకర్తల ఆవేదనగా ఉంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుటుంబాలపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన వారిపై తప్ప తాము అనుభవించిన బాధలను పట్టించుకోకకపోవడమేమిటన్న బాధ వారిని పట్టి పీడిస్తోంది.

పార్టీ పెద్దలకు తీరిక లేదో లేక నేతలు సమయం కేటాయించలేదో తెలియదు గాని ఈ సారి మినీ మహానాడు చాలా పేలవంగా సాగింది. కార్యకర్తల్లో మునుపటి ఉత్సాహం కనిపించలేదు. తమ పార్టీ ప్రభుత్వం వచ్చిందనే సంతోషం వారి ముఖాల్లో కానరాలేదు. నేతల ప్రసంగాలకూ పెద్దగా స్పందన కనిపించకపోవడం వారిలో నిస్తేజాన్ని తెలియజేస్తోంది. మహానాడులో సరిగా తీర్మానాలే చేయలేని పరిస్థితి కనిపించింది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, మహిళా సాధికారత తదితర 13 అంశాలపై తీర్మానాలను ఆమోదించాలని నిర్ణయించినా కేవలం ఐదింటితోనే సరిపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలు చేసిన ప్రసంగాలు ప్రభుత్వాన్ని, పార్టీని ఇరకాటంలో పడేశాయి. రాష్ట్రంలో ఈ సంవత్సరం ఇరిగేషన్ కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని, అందులో జిల్లాకు వెయ్యి కోట్లు ఇస్తే పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవచ్చుంటూ అని ఎమ్మెల్యే కూన రవికుమార్ చెప్పడం ద్వారా నిధుల కేటాయింపులో జిల్లాపై ప్రభుత్వం చూపిన చిన్నచూపు బట్టబయలైంది. టిడిపి మహానాడు జరిగిన ప్రతి సందర్భంలోనూ సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై తీర్మానాలు చేస్తూనే ఉన్నా టిడిపి హయాంలోనూ అవి పూర్తి కాని పరిస్థితిని చూస్తున్నాం. మహానాడులో పూర్తిస్థాయిలో తీర్మానాలు చేయకపోగా, పాత అంశాలపైనే మళ్లీ తీర్మానాలు చేయడం కనిపించింది. మొత్తం మీద టిడిపి పార్లమెంటరీ స్థాయి మినీ మహానాడు అటు జిల్లా ప్రజలకు గాని, తమ ఆవేదనను వెలిబుచ్చడానికి ఇటు కార్యకర్తలకు వేదిక గాని ఉపయోగపడింది ఏమీ లేదనే చెప్పాలి.

నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న కల్నల్

ఐతమ్ డైరెక్టర్‌తో కల్నల్ భేటీ

టెక్కలి రూరల్: శ్రీకాకుళం 14వ ఎన్‌సిసి జై ఆంధ్రా బెటాలియన్ కల్నల్ పి.కె.పండా ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్. వి.వి. నాగేశ్వరరావును శనివారం తన ఛాంబర్‌లో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 31 నుంచి జున్ 9 వరకు నిర్వహించనున్న ఎన్‌సిసి 9 వార్షిక క్యాంప్ కోసం చర్చించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని కళాశాలల్లో ఎన్‌సిసి విద్యార్థులు ఈ క్యాంపులు పాల్గొంటారని అన్నారు. వారికి వసతి, భోజనం ఇతర సౌకర్యాల ఏర్పాట్లపై ఇరువురు చర్చించారు. కల్నల్ తోపాటు సుభదర్ జితేంద్ర పాల్ సింగ్, ఐతమ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, ఎన్‌ఓ ట.మురళీమోహన్, ట్రైనర్ భుజంగరావు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

పోలాకి : మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం పలువురు లబ్ధిదారులకు సిఎం సహాయ నిధిని అందజేశారు. వెదుల్లవలస శివాలయం అర్చకులు అత్తిలి శ్రీనివాసరావు బ్రెయిన్ సర్జరీ కోసం రూ.45 వేలు, చెల్లాయివలస ముద్దాడ తవిటినాయుడు కిడ్నీ వ్యాధి సర్జరీకి రూ.1,78,750, అంబీరుపేట మళ్ల వైకుంఠరావు కుడి కాలు సర్జరీకి రూ.60 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు పాల్గొన్నారు.

టిడిపి శాశ్వత సభ్యత్వం నమోదు

శ్రీకాకుళం: స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదు ఒక మహోత్తర కార్యాచరనన్నారు. అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇచ్చిన ఘనత టిడిపిదేనని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారిని దృష్టిలో ఉంచుకొనే ఈ శాశ్వత సభ్యత్వాన్ని అమలు పరిచారన్నారు. శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న ప్రతీ వ్యక్తికి సౌలభ్య సౌకర్యాలను టిడిపి కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చి శాశ్వత సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు శాశ్వత సభ్యత్వ కార్డులను అందించారు.

క్రికెట్ విజేత 'రాజు లెవెల్స్'

పలాస: కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో మూడు రోజులుగా నిర్వహించిన కెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఆ ప్రాంతం నుంచి పలు టీంలు పాల్గొనగా రాజు లెవెల్స్ విజేతగా నిలవగా, రెండో స్థానంలో సారథి టీం నిలిచింది. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి హాజరై గెలుపొందిన క్రికెట్ టీమ్‌లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ద్వారా క్రీడా కారులో ఉత్సాహం, ఆనందం కలుగుతుందన్నారు. క్రీడా కారులో ఉన్న ప్రతిభ కనబరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్రీడాకారులు నిత్యం స్నేహ భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో జోగ తిరుపతిరావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు థమన్ తనీష్ ఎంపిక

పలాస : ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షలో పలాసకు చెందిన సీపాన థమన్ తనీష్ కు 30 ర్యాంకు సాధించాడు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షలకు జరిగే ఎంట్రన్స్ పరీక్షలో 300 మార్కులు గాను, 281 సాధించి 30వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి రాంబాబు పలాస ఎస్‌బిఐ శాఖలో మేనేజర్‌గా పనిచేస్తుండగా, తల్లి వనిత గృహిణి. విద్యార్థికి ర్యాంకు రావడంపై ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

లావేరు: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉండాలని వీరఘట్టం మండలం గంగమ్మపేట ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఎం.భాస్కరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్రమశిక్షణ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు వెళ్లాలంటే విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు క్లాస్ పుస్తకాలకే పరిమితం కాకుండా ఇటువంటి వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొని అన్ని విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

క్లస్టర్ పాఠశాలకు సామగ్రి పంపిణీ

పొందూరు: పొందూరు క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు హెచ్‌ఎం పి.వెంకటరావు ఆధ్వర్యంలో శనివారం మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంఇఒలు జి.శ్రీరాములు, పి.రాజారావుల చేతులమీదుగా క్లస్టర్ పరిధిలో గల పాఠశాలలకు మెగామైక్, స్టేషనరీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఆర్ఎంటి శేఖర్, హెచ్‌ఎం గురుగుబెల్లి మధుబాబు, అల్లంశెట్టి రవి, దండా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచిలి సర్పంచ్ కవిటి రామరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయనకు, అదే ప్రమాదంలో మృతి చెందిన కవిటి ఆనందరావు కుటుంబ సభ్యులకు శనివారం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించారు. అలాగే తర్లిపేట పంచాయతీ చలమయ్యపేట వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చలమయ్యపేటకు చెందిన చెల్లూరు మల్లేష్, అంగ అప్పన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు వైసిపి మండల అధ్యక్షుడు హేమ సుందరరాజు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకట్రావు, నూక సత్యరాజ్, వినోద్, గోవింద్, బొడ్డు వెంకటరమణ, కాళ్ల సంజీవ్ ఉన్నారు.

ఘనంగా దాసుబాబు జన్మదిన వేడుకలు

నరసన్నపేట: టిడిపి జిల్లా యువత అధ్యక్షులు మెండ దాసునాయిడు జన్మదిన వేడుకలు శనివారం వై.బి.వలస స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం వికలాం గులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపి టిసి మాజీ సభ్యులు మెండ ఆదిలక్ష్మి, సర్పంచ్ మెండ శ్రీనివాసరావు, ఎంపిటిసి యాగాటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పల్లిసారథిలో మద్యం కిక్కే కిక్కు

- బాటిల్‌పై రూ. 30 అదనపు వసూలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

బార్‌ను తలపిస్తున్న బెల్ట్‌షాప్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రాష్ట్రంలో బెల్ట్ షాపులు ఎక్కడ నడిపినా చర్యలు కఠినంగా ఉంటాయి... మద్యం బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతాం... ప్రభుత్వ నిబంధనలకు లోబడే మద్యం విక్రయాలు చేపట్టాలి... ఇదీ ప్రభుత్వ పెద్దలు అను నిత్యం చెబుతున్న నీతి వాక్యాలు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఉత్సవాలు పేరుతో బెల్ట్ షాపు.. కాదు... కాదు ఏకంగా బారు నడుస్తుంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నడుపుతుంటే... అరికట్టాల్సిన ఎక్సైజ్, పోలీసు శాఖలు చోద్యం చూస్తున్నాయి.

వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథిలో శుక్రవారం నుంచి గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహణకు వేలం పాట వేశారు. ఏకంగా రూ.9 లక్షలకు బెల్ట్‌షాపు వెలసింది. అదీ పల్లిసారథి ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా కావడం విశేషం. గ్రామ కమిటీకి డబ్బులు చెల్లించాను ఇష్టారాజ్యంగా అమ్ముకోవడానికి ఉత్సవాలకు వారం రోజులు ముందు బెల్ట్ షాపు నిర్వాహకుడు తెరిచాడు. అయితే పోలీసు శాఖ అభ్యంతరం చెప్పడంతో రెండు రోజుల్లోనే బెల్ట్ షాపును మూసేశారు. గ్రామ కమిటీ రంగంలోకి దిగి బెల్ట్‌షాపు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడంతో నిరభ్యంతరంగా నిర్వాహకుడు అమ్మకాలు చేపడుతున్నారు. బెల్ట్‌షాపునకు అనుబంధంగా ఏకంగా బారు నడుపుతున్నారు. బడి, ఆలయం సమీపంలో మద్యం అమ్మకాలు నిషిద్ధం. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా బహిరంగంగా అనధికారికంగా బెల్ట్ షాపు ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నా నియంత్రించాల్సిన ఎక్సైజ్, పోలీసు శాఖలు చోద్యం చూస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎక్సైజ్, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గ్రామం నడిబొడ్డున బెల్ట్ షాపు ఏర్పాటుతో మందుబాబుల ఆగడాలకు అడ్డు లేకుండా పోతుంది.

మహిళలు ఆ ప్రాంతం నుంచి నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ దేవత ఉత్సవాలు పుణ్యమా అని అనధికారికంగా బెల్ట్ షాపు నిర్వహణతో పల్లె మద్యం మత్తులో జోగుతుంది. అభ్యుదయ భావాలున్న పల్లిసారథిలో బెల్ట్‌షాప్‌ను ప్రోత్సహించడం చర్చనీయ అంశమైంది. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి బెల్ట్ షాపు తొలగించాలని మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై పలాస ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు స్పందిస్తూ బెల్ట్ షాప్‌లు ప్రోత్సహించే ప్రసక్తే లేదని అన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పలాస : యోగా చేస్తున్న ఆర్‌డిఓ వెంకటేష్

ప్రజాశక్తి- పలాస

యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఆర్‌డిఓ జి.వెంకటేష్ అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో యోగ ఆంధ్రా సందర్భంగా డివిజన్ స్థాయిలో శనివారం యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా శిక్షణ రెండు రోజుల పాటు ఇస్తామన్నారు. అనంతరం ఎవరికి ఎక్కడ శిక్షణ పొందాలనుకుంటే ఆయా మండల స్థాయిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బూర్జ: యోగతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని ఆయుష్ వైద్యాధికారి జి. మంగమ్మ అన్నారు. శనివారం యోగేంద్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. యోగాను అవలంభించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందగలుగుతారన్నారు. ప్రస్తుతం ప్రతిఒక్కరూ అశాంతి, మానసిక ఆందోళన కలిగి ఉంటున్నారని, దీనివలన పలు అనారోగ్య సమస్యలకు గురవుతూ సతమత మవుతున్నారన్నారు. యోగా కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండి ప్రతిఒక్కరూ ప్రతిరోజు కొంత సమయాన్ని యోగాపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవల్లికతో పాటు వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ అన్నారు. యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిరోజు తమ గృహ పరిసర ప్రాంతంలో సుమారు గంట సమయం యోగాశనాలు ఆచరించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.

బూర్జ : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మంగమ్మ

మున్సిపల్ ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని తెంబూరు సచివాలయం ఆవరణలో ప్రభుత్వ యోమియో వైద్యాధికారి ఉమాగౌరీ యోగాపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ మెయిల్ ఇన్స్‌పెక్టర్ మహేష్ వివిధ రకాల యోగాసనాలు వేసి చూపించి అందరితో వేయించారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ బి.సిమ్మన్న పాల్గొన్నారు.

నరసన్నపేట: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన యోగా శిక్షణలో ఎంపిడిఓ బి.మధుసూదన రావు, తహశీల్దార్ సత్యనారాయణ, వైద్యాధికారి సీతామాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిఐగా శ్రీనివాసరావు

శ్రీనివాసరావు, సిఐ

నరసన్నపేట: నరసన్నపేట సిఐగా ఎం.శ్రీనివాసరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను పార్వతీపురం మన్యం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చానని అన్నారు. శాంతిభద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే గతంలో ఇక్కడ విధులు నిర్వహించి విశాఖపట్నం బదిలీ అయ్యానని అన్నారు. సిఐకి నాలుగు మండలాల ఎస్ఐలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

విద్యార్థులకు అభినందన

రణస్థలం: ఎపిఆర్‌డిసిలో ఉత్తమ ఫలితాలను స్థానిక మోడల్ కాలేజీ విద్యార్థులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ డిగ్రీ (ఎపిఆర్‌డిసి) ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని ద్వితీయ సంవత్సరం బైపిసి విద్యార్థులు గొర్లె గణేష్ 7వ ర్యాంక్, సిహెచ్ చైతన్య 13వ ర్యాంకుతో పాటు సిఇసికి చెందిన ఎం.తేజేశ్వరరావు 19వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

రేపు పోరుయాత్ర ర్యాలీ

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండి గేట్ నుంచి వజ్రపుకొత్తూరు వెళ్లే రోడ్డు వెంటనే పూర్తి చేయాలని కోరుతూ ఈ నెల 26న బెండిలో పోరుయాత్ర ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎపి రైతు సంఘం మండల నాయకులు కె.బాలాజీరావు, కె.హేమసుదన్‌రావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకటరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు పనులు ప్రారంభించి మూడేళ్లు అవుతున్నా... ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. బాగున్న రోడ్డును తవ్వేసి గోతులు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : మహాత్మా జ్యోతీభాపూలే బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశ నిమిత్తం నిర్వహించిన పోటీ పరీక్షలో టెక్కలి న్యూ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్‌కి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని డైరెక్టర్ దేవాది శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ కోచింగ్ సెంటర్ నుంచి 20 మంది విద్యార్థులు పరీక్షాకు హాజరు కాగా, 13 మంది విద్యార్థులు 50 లోపు మార్కులు సాధించి ప్రతిభ కనబరిచి ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. విజేతలకు ఉపాధ్యాయులు శ్రీనివాసరావు అభినందించారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

నందిగాం: నిత్యవసర సరుకులు రేషన్ డిపోల వద్ద విధిగా ధరల పట్టికలో ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. చౌక ధరల దుకాణాల వద్ద ధరల పట్టికతో పాటు డీలర్ వివరాలు పొందుపరచాలని సూచించారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు విధిగా జూన్ 1 నుంచి 5లోపు వృద్ధులకు, వికలాంగులకు, మంచంపై ఉన్న రోగులకు సరుకులు అందించాలని సూచించారు డిపోల వద్ద బెంచీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిటి అనిల్‌కుమార్ పాత్రో, డిటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యనారాయణ

చౌకబారు విమర్శలు మానుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ చౌకబారు విమర్శలు మానుకోవాలని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల టిడిపి నిర్వహించిన మినీ మహానాడుకు ఉపాధి కూలీలను మస్టర్లు వేసి తరలించామని చింతాడ రవికుమార్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా వేల సంఖ్యలో జనాలు తరలివస్తారని గడచిన ఎన్నికల్లో చింతాడకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 21 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎమ్మెల్యే రవికుమార్ ఎటువంటి అవినీతి ఆరోపణలు ఎదుర్కోలేదన్నారు. వైసిపి ఆరోపణలన్నీ ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను టిడిపి అమలు చేస్తుందని అన్నారు. జూన్ 12న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభిస్తున్నట్లు ఇటీవల సిఎం చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. వైసీపీ నాయకుల మాటలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, టిడిపి నాయకులు అంబళ్ల రాంబాబు, బోర గోవిందరావు, బి.వి.రమణమూర్తి, ఇంజరాపు విశ్వనాథం, మీసాల రామారావు, నాగళ్ల మురళీధర్, కందుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

ప్రతి చేనుకూ నీరు.. ప్రతి చేతికీ పని అనే పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సంకల్పం మేరకు అన్నదాతకు ఆసరాగా యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నామని టిడిపి నాయకులు పీరికట్ల విఠల్‌రావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువకు సంబంధించిన గుర్రాల గెడ్డలో పూడికతీత పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది ముందస్తుగానే వంశధార కాలువ నుంచి సాగునీటిని రైతులు చెంతకు చేర్చేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాగినీటి వనరులను అభివృద్ధి చేసేందుకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయని అన్నారు. ప్రధానంగా వంశధార కాలువ, మిగిలిన ఉప కాలువలను అభివృద్ధి చేసేందుకు రూ.85 లక్షలు వెచ్చించనున్నట్లు చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు, నీటి సంఘాల అధ్యక్షులు నీటి వనరుల స్థితిగతులను అంచనా వేసి, నివేదిక రూపొందించారని వారి సేవలను కొనియాడారు. రెండు వారాల్లో పూడికతీత పనులను చేపట్టి సాగునీటిపారుదలకు ఉన్న అడ్డంకులను అధిగమిస్తామని ధర్మ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దువ్వాడ సంతోష్, రామ్ నాయుడు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు గొనప నిరంజన్, లక్ష్మీపురం నీటి సంఘ అధ్యక్షులు సిస్టు మురళి, నగరంపల్లి నీటి సంఘం అధ్యక్షులు దువ్వాడ అప్పారావు, కవిటి నీటి సంఘ అధ్యక్షులు దాసరి దాసరథి, అమలకుడియా నీటి సంఘ అధ్యక్షులు వరిశ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న టిడిపి నాయకులు

ఆరోగ్యకర ఆహారంతో రక్తపోటు దూరం

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వజ్రపుకొత్తూరు: ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా అధిక రక్తపోటుకు దూరంగా ఉండ వచ్చని ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి ఇ.వెంకటరావు అన్నారు. మండలంలోని గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అధిక రక్తపోటుపై శనివారం అవగాహనా నిర్వహించారు. సరైన వ్యాయామం లేకపోవడం అధిక రక్తపోటుకు ప్రధాన కారణమని అన్నారు. ప్రతిఒక్కరూ వారంలో ఐదు రోజులు 30 నుంచి 40 నిమిషాలు పాటు వ్యాయామం చేయాలని సూచించారు. ఆహారంలో ఉప్పు నూనెలు వాడకం తగ్గించి ముందిస్తూ జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అన్నారు. తరచుగా బిపి తనిఖీ చేసుకుని మందులు క్రమం తప్పకుండా వాడాలని అన్నారు. వైద్యులు సూచనల మేరకు జీవనశైలి మార్చు కోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వాహిని ప్రియాంక, వినయ్‌కుమార్, ఎన్‌సిడి ఎఫ్ఎల్‌సి అప్పారావు, ఆర్‌బిఎస్ కె.మేనేజర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని మండల పరిషత్ కార్యాలయ ఎఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో స్వయం సహాయక సంఘ గ్రూపు సభ్యులతో కలిసి ప్రపంచ పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవన విధానం గడపాలంటే పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, ఘన, ద్రవ వ్యర్థాలు వేరుచేసి చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. మంచి వాతావరణంలో గడపాలంటే మొక్కలను పెద్దఎత్తున నాటాలని అన్నారు. పచ్చదనం పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, స్వచ్ఛభారత్ సభ్యులు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాలకు జెవై అకాడమీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలో జె.వై అకాడమీ చైర్మన్ జె.వై.శంకర్ పర్యవేక్షణలో గత పదిహేనేళ్లుగా నడపబడుతున్న జె.వై.గ్రూప్స్ విద్యాసంస్థల్లో వ్యక్తిగత శ్రద్ధ, యజమాన్యం కృషితోనే జె.వై అకాడమీ ఆధ్వర్యంలో ఐఐటి, జెఇఇ 2025 మెయిన్స్ విద్యార్థులు విజయం సాధించారు. రోహిత్ నూకల 99.67, రఘుపాత్రని అనుదీప్ 99.26, కరణం హర్షిత్ 98.18 సాధించారు. జె.వై.స్కూల్‌లో ఐదు నుంచి 10వ తరగతి వరకు ఫౌండేషన్‌లో 24 మంది విద్యార్థులు అసాధారణ ఫలితాలు సాధించడం గర్వకారణమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. జెఇఇ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన వారు 15 మంది, మేథ్స్‌లో 99 శాతంపైన ఏడుగురు సాధించారు. ఫిజిక్స్‌లో 99 శాతంపైన సాధించిన వారు 11 మంది, కెమిస్ట్రీలో 99 శాతంపైన సాధించిన వారు ఆరుగురు, 90 శాతం పైబడి 12 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 2024 - 25 సంవత్సరం ఎపిఇ ఎపిసెట్ ఫలితాల్లో యశ్వంత్ 742 ర్యాంక్, బి.చంద్రమౌళి 2387 ర్యాంక్, వై.తనుష్క 4646 ర్యాంక్, కె.తిరుపతిరావు 5013 ర్యాంక్, సిహెచ్ దేవిశ్రీ 7300 ర్యాంక్, కె.ప్రేమ్ కుమార్ 7800 ర్యాంక్, టి.అభినవ్ 9069 ర్యాంక్, జె.మనీషా 10,807 ర్యాంక్‌లు సాధించారు.

ప్రత్యేకతలు

రోజువారీ ప్రాక్టీస్ పేపర్లు, ఆన్‌లైన్ ప్రాక్టీస్, సీనియర్ ఫ్యాకల్టీతో సందేహ నివృతి సెషన్‌లు. 40 స్లిప్ పరీక్షలు. పూర్తి పేపర్ వివరణతో 20 గ్రాండ్ పరీక్షలు నిర్వహణ, బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్స్ సదుపాయం. సూక్ష్మస్థాయి షెడ్యూల్, జాతీయ స్థాయి కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో అడ్మిషన్స్ జరుగు తున్నాయన్నారు. ఎంసెట్, ఎపిఇఎ సెట్ మార్చి 20 నుంచి క్లాసులు ప్రారంభమయ్యాయన్నారు.



రెండో రోజు నిలిచిన బస్సులు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి గోపీనాథపురం వద్ద వద్ద కల్వర్టు పనులు చేస్తుండడంతో రెండు రోజులుగా బస్సులు నిలిచిపోయాయి. దీంతో టెక్కలి నుంచి పూండీ వైపు వెళ్లే బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ఆ ప్రాంత ప్రయాణికులు పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గోపీనాథపురం వద్ద ఇటీవల కల్వరు కూటిపోయింది. ఈ మార్గం మీదుగానే పోర్టుకు వెళ్లే వాహనాలు అధికంగా తిరగడంతో వారికీ ఇబ్బందులు కలిగాయి. అయితే రోడ్డు, భవనాలశాఖ, పోర్టు అధికారులు సంయుక్తంగా కల్వర్టు పనులు పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా దీనిని మరమ్మతులు చేసే క్రమంలో పనులు జాప్యం వల్ల ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అయితే రాత్రి సమయంలో పనులు పూర్తి చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ మార్గం మీదుగానే నౌపడ రైల్వే స్టేషన్‌కి వెళ్లే మార్గం కావడం, పూండీ రోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో రెండు రోజులుగా వాహనదారులు, ఈ మార్గం మీదుగా ప్రయాణం చేసే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కాగా, ఆర్‌టిసి డిపో నుంచి పూండీ వైపు వెళ్లేందుకు రోజూ ఐదు షటిల్ బస్సులు తిరుగుతుండేవి. కల్వర్టు పనులు వల్ల మార్గం మూసుకుపోవడంతో బస్సులు నిలిచిపోవడంతో ఆర్‌టిసికి ఆదాయానికి గండిపడుతుంది. ఈ మార్గం ద్వారా రోజుకు సుమారు రూ.80 వేలు ఆదాయానికి గండిపడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి యథావిధిగా రాకపోకలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కల్వర్టు పనులు చేస్తున్న కూలీలు

లక్ష్మీపతి మృతదేహం (ఇన్‌సెట్‌లో లక్ష్మీపతి)

పిడుగుపాటుకు యువకుడు మృతి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం పెద్దకేసినాయుడు పేటకు చెందిన మోర్పి లక్ష్మీపతి (21) టెక్కలిలో పిడుగు పాటుకు గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టెక్కలి వై కూడలి సమీపంలో మూలపేట పోర్టుకు రహదారి నిర్మాణానికి చెందిన ప్రొక్లెయినర్‌లో కొద్ది రోజులుగా హెల్పర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం అకస్మాత్తుగా వాతావరణం మారి గాలులు వీచాయి. ఈ క్రమంలో అక్కడే ప్రొక్లెయినర్‌లో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీపతి సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతి చెందరంతో తల్లిదండ్రులు వెంకట్రావు, నారాయణమ్మ శోకసంద్రంలో మునిగిపోయారు. మృతునికి వివాహమైన ఇద్దరు సోదరులు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే లక్ష్మీపతి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి. టెక్కలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణరావు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నందిగాం: మండలంలోని కొత్తఅగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శారదాపురానికి చెందిన బూరి నారాయణరావు (59) తన స్వగ్రామం నుంచి కొత్తగ్రహారం వెళ్తున్నాడు. మార్గంమధ్యలో కొత్త అగ్రహారం వద్ద టి తాగేందుకు యూ టర్న్ తీసుకున్నాడు. ఈ సమయంలో పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయ పడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విష మించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హెచ్‌సి జి.వి.రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కె.కొత్తూరులో దొంగలు హల్‌చల్

టెక్కలి రూరల్ : మండలంలోని కె.కొత్తూరులో శనివారం వేకువజామున దొంగలు హల్‌చల్ చేశారు. కొందరు యువకులు దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో గమనించిన స్థానికులు కేకలు వేయడంతో యువకుడు తన వద్ద ఉన్న కత్తిని చూపించి బెదిరించాడు. గ్రామస్తులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్ప గించారు. మరికొందరు పారిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. సిఐ అంబటి విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిరియాకండిలో ఘర్షణ

మెళియాపుట్టి : మండలంలోని సిరియాకండిలో శుక్రవారం రాత్రి డిజె విషయంలో ఘర్షణ చోటు చేసు కుంది. డిజె సిబ్బందికి పట్టుపురానికి చెందిన వ్యక్తుల మధ్య ఘర్షణ జరగడంతో కేసు నమోదు చేసినట్లు పాతపట్నం సిఐ రామారావు తెలిపారు. ఈ కేసులో డిజె యజమాని వెంకటరావు, పట్టుపురానికి చెందిన ప్రదీప్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

శివాలయంలో చోరీ

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగలోని రామేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ధర్మకర్త బెందాళం రామ్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఇచ్ఛాపురం సిఐ చిన్నం నాయుడు, కవిటి ఎస్ఐ రవివర్మ, క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ధర్మకర్త రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నిందితుడు ఆలయ దక్షిణ ద్వారం తలుపులు రాయితో పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్లు తెలిపారు. శివుడి పంచలోహ విగ్రహం, వినాయక విగ్రహం, రెండు దీపపు కుందెలు, శటగోపం, ఇత్తడి ప్రమిదలు 3, ఇత్తడి పల్లేలు 3 చోరీ జరిగినట్టు తెలిపారు. నిందితుడు తన చెప్పులు కూడా ఆలయ ప్రాంగణంలోనే విడిచిపెట్టి చోరీ చేసిన వస్తువులతో పరారైనట్టు చెప్పారు. ఆలయంలో సిసి కెమెరాలు అమర్చినా అవి పని చేయకపోవడంతో నిందితున్ని పట్టుకోవడంలో జాప్యానికి కారణమవుతోంది.

బంగారం చోరీ

పాతపట్నం : మండలంలోని కాపుగోపాలపురంలో బూసి దమయంతి ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాలో గల సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడు దొంగిలించారు. దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.లావణ్య పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో విలువైన ఆభరణాలు, వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలని, అపరిచిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుకోవాలని సూచించారు.

నిలిచిన తాగునీటి సరఫరా

టెక్కలి : మేజర్ పంచాయతీ పరిధిలో టెక్కలి పట్టణంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగు నీరు శనివారం నిలిచిపోయింది. స్థానికంగా ఉన్న వీధి వద్ద తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేపడు తున్నారు. పనుల్లో జాప్యం కారణంగా నీరు నిలిచి పోయింది. దీంతో కుళాయిల నీటిపై ఆధారపడిన ప్రజానీకం ఇబ్బందులు పడ్డారు. వేసవిలో నీటికి అల్లాడుతున్న తరుణంలో కుళాయి ద్వారా సరఫరా కాకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు.

ఆమె నేత్రాలు సజీవం



రేష్మా (ఫైల్)

శ్రీకాకుళం: జిల్లాలోని శ్యామ్‌పాలెంకు చెందిన దొండపాటి రేష్మా (21) శనివారం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేయాలని గతంలో నిర్ణయించారు. ఆమె తల్లిదండ్రులు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు తెలియజేశారు. దీంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ.టెక్నీషియన్ పూతి సుజాత, పి.సుమతిల ద్వారా ఆమె కార్నియాలు సేకరించారు. అనంతరం విశాఖ పట్నంలోని ఎల్.వి. ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.